# వినియోగదారుల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 7: జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వినియోగదారుల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు జడ్జి శ్యాముల్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, పౌర సరఫరాల శాఖాధికారి కిరణ్ కుమార్, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, జిల్లా వినియోగదారుల సహాయ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరలాల్‌చౌరాసియా, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్, జిల్లా కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు ఆంజనేయులు, వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా వినియోగదారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మోహన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ పాల్గొన్నారు.

# మహిళా చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద

ఆదిలాబాద్‌రూరల్, అక్టోబర్ 7: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లోని వృత్తి విద్య నైపుణ్య, శిక్షణ కేంద్రంలో మహిళా సాధికారత కేంద్రం (మిషన్ శక్తి), సఖీ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం మహిళలు, విద్యార్థినులకు బేటీ బచావో– బేటీ పడావో పథకం, లింగ సమానత్వం, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ పీసీ ఎన్‌డీపీ యాక్ట్, బాల్య వివాహ చట్టం, వరకట్న నిషేధ చట్టం, మహిళా శిశు సంక్షేమ శాఖ అందిస్తున్న సేవల గురించి వివరించారు. సఖీ కేంద్రం నిర్వాహకురాలు సఖీ సేవలు, గృహ హింస చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీహెచ్ ఈడబ్ల్యూ టీం కృష్ణవేణి, కోటేశ్వర, సఖీ కేంద్రం నిర్వాహకులు, శ్రీ షిర్డీ సాయి సేవ సొసైటీ కేంద్రం నిర్వాహఖులు అశోక్, అధ్యాపకులు వినోద్, దశరథ్, రాజు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

జైనథ్, అక్టోబర్ 7 : అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో అంతర్రాష్ట్ర పిప్పర్‌వాడ చెక్‌పోస్టును శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా ఏడు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. 24 గంటలు మూడు షిఫ్టుల్లో నిరంతరం విధులు నిర్వహించాలన్నారు. పోలీసు రవాణా, ఎక్సైజ్, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల సమన్వయంతో పని చేయాలన్నారు. చెక్ పోస్టుల గుండా అక్రమంగా రవాణా అయ్యే డబ్బు, మద్యం, గంజాయి, ప్రజాకర్షణ వస్తువులను నిరంతరం తనిఖీ చేస్తూ వాటిని సీజ్ చేయాలన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య వచ్చిపోయే వాహనాలపై నిఘా పెంచాలన్నారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నర్సింహరెడ్డి,ఎక్సైజ్ సూపరింటెండెంట్ హేమశ్రీ, జైనథ్ సీఐ కోల నరేశ్‌కుమార్ ఉన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో ఇంటర్ విద్య

ఇంద్రవెల్లి, అక్టోబర్ 7: ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయిలో ఇంటర్ విద్యను అందించడం జరుగుతుందని జిల్లా మాధ్యమిక విద్యాధికారి (డీఐఈవో) రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని లింగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని అధ్యాపకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లాలో ఉన్న 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతంగా ద్వితీయ సంవత్సరంలో 100 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఉచితంగా ఎంసెట్ కోచింగ్ అందిస్తున్నామన్నారు. కలెక్టర్ పూర్తి సహకారంతో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, అధ్యాపకులు శ్రీనివాస్, స్వామి, వెంకటేశ్ ఉన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 7 : పేదల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్బన్, మావల, రూరల్‌కు చెందిన 148 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డ కుటుంబం అప్పులపాలు కావద్దని సీఎం కేసీఆర్ రూ.లక్షా 116 అందజేస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ఇటు అమ్మాయిలకు, ఎటు సఖ్యత లేని పాలనతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇలాంటి ప్రభుత్వాలను నమ్ముకున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, అమ్మఒడి, అల్పాహార పథకం యావత్ తెలంగాణ ప్రజానీకానికి అండగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీ, పట్టణాధ్యక్షుడు అజయ్, అశ్రఫ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, పందిరి భూమన్న, సలీం, ఇమ్రాన్, కోఆప్షన్ సభ్యుడు ఏజాజ్, సాజిదుద్దీన్ పాల్గొన్నారు.

**ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ**

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 7 : అన్ని కుల సంఘాలను గౌరవిస్తూ వారిలో ఉన్న చైతన్యాన్ని పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతో ఉందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లో రూ.10 లక్షల చేపడుతున్న ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. గాంధీ పార్క్‌లోని భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మరో రూ.5 లక్షల ఆలయాభివృద్ధికి భూమి పూజ చేశారు. అనంతరం ముదిరాజుల మహనీయుడు పండుగ సాయన్న నూతన విగ్రహ ఏర్పాటులో భాగంగా సంఘ సభ్యులతో కలిసి పాలాభిషేకం చేశారు. పోటీ పరీక్షల్లో నూతనంగా ఎంపికైన ముదిరాజ్ విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు దారవేణి రాము, రవి, బొజ్జ సంతోష్, సత్యనారాయణ, వెంకటేశ్, ఆదినారాయణ, భగవాన్లు పాల్గొన్నారు.

## సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికైన యువతికి సన్మానం

ఇంద్రవెల్లి, అక్టోబర్ 7 : సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన మండలంలోని మర్కాగూడ గ్రామానికి చెందిన కోలాం గిరిజన(పీవీటీజీ) యువతి కొడప జ్యోతిని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలన్నారు. కోలాంతెగకు చెందిన యువతి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికవడం చాల సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వన్యప్రాణ సంరక్షణ వారోత్సవాలు ప్రారంభం



అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీవో బర్నోబా

ఎదులాపురం, అక్టోబర్ 7 : ప్రతి సంవత్సరం అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే జాతీయ వన్యప్రాణ సంరక్షణ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం మావల హరితవనంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల మనుగడకు ముప్పు అనే విషయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో బర్నోబా మాట్లాడుతూ జాతీయ వన్యప్రాణ సంరక్షణ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో గులాబ్‌సింగ్, ఎఫ్‌బీవో ప్రశాంత్, పార్కు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే పండుగలకు గుర్తింపు

నార్నూర్, అక్టోబర్ 7 : తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే పండుగలకు గుర్తింపు వచ్చిందని సర్పంచ్ హెచ్‌కే చంద్రహరి అన్నారు. గాదిగూడ మండలం ఖండో గ్రామంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాథోడ్ కిరణ్, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

జైనథ్, అక్టోబర్ 7: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దేవన్న మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

నార్నూర్, అక్టోబర్ 7 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించుటకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎంపీడీవో కావల రమేశ్ అన్నారు. నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుంజాల గ్రామంలో సంకల్ప సప్తాహ కార్యక్రమం శనివారం నిర్వహించారు. చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఉత్తమ విద్యార్థి, ఉపాధ్యాయుడిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమ్ర సావిత్రీబాయి, ఉప సర్పంచ్ చంద, ఎంఈవో ఆశన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, అక్టోబర్ 7 : బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ యాప్ ద్వారా డీఎస్సీ, ఎస్జీటీ టీచర్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి కే రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డీఎస్సీ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. కేవలం 100 మందికి అవకాశం ఉందన్నారు. ఇందులో బీసీలకు 75 శాతం, ఎస్సీలకు 15, ఎస్టీలకు 5, ఈబీసీలకు 5 శాతం అవకాశం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 08732221280ను సంప్రదించాలన్నారు.

## కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలు

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 7: మావల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరిన ముగ్గురు వ్యక్తులు హరితవనం పార్క్ ఎదుట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి నిద్రమత్తుతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దీపక్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వెంటనే 108 వాహన ఈఎంటీ కిషన్, పైలెట్ ముజాఫర్ క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు.

## గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్,అక్టోబర్ 7: ఏజెన్సీలో జీవిస్తున్న గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాగ్మారే భరత్, జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావ్ అన్నారు. శనివారం స్థానిక హెచ్‌కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, రాష్ట్ర నాయకులు నర్సయ్య, ఫయాస్, మసూద్, ప్రజ్ఞాశీల్, కాటం రమేశ్, నర్సింగ్ మోరే, చంద్రయ్య పాల్గొన్నారు.

## మండల కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా దావుల రమేశ్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ రషీద్, సింగారే భరత్, ఇలియాస్, ప్రధాన కార్యదర్శి సోఫియాన్, జాయింట్ సెక్రటరీ కేంద్రే రమేశ్, ప్రచార కార్యదర్శి గైక్వాడ్ భరత్, కోశాధికారిగా ఠాకూర్ గోపాల్‌సింగ్‌ను ఎన్నుకున్నారు.

## పత్తి పంట ప్రదర్శన

ఎదులాపురం, అక్టోబర్ 7 : అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు ప్రాజెక్టులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శంకర్‌నారాయణ్ క్షేత్రాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుకు తీసుకుంటున్న చర్యలు వివరించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వై ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాం ప్రసాద్, కేవీకే శాస్త్రవేత్త కే రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.